సాక్షి
పల్నాడు

గురువారం । 24 । అక్టోబర్ । 2024




వైభవంగా కళ్యాణోత్సవం

నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/7వ అడ్డ రోడ్డులోని శ్రీగౌరీ విశ్వేశ్వరాలయంలో బుధవారం స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని కల్యాణం నిర్వహించారు.



పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 31,269 క్యూసెక్కులు వస్తోంది. దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం 44.38 టీఎంసీలు నిల్వ ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 5,009, హై లెవల్ కాలువకు 226, బ్యాంక్ కెనాల్‌కు 1,356 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరునికి లక్ష బిళ్వార్చన



అమరావతి: ప్రముఖ శైవక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో బుధవారం లోక కళ్యాణార్థం లక్ష బిళ్వార్చన నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన శృంగేరిపీఠం అస్తుల పరిరక్షణాధికారి వేమూరి రామం ఆధ్వర్యంలో తొలుత మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి, రుద్ర హోమం నిర్వహించారు. బాలచాముండికా అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు చేశారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ , ఆలయ ఈవో వేమూరి గోపీనాథశర్మ, భక్తులు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయం ఈఓగా సునీల్‌కుమార్



అమరావతి: ప్రసిద్ధి చెందిన అమరావతి అమరేశ్వరాలయానికి నూతన కార్యనిర్వహణ అధికారిగా బుధవారం కె. సునీల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఈవో వేమూరి గోపీనాథశర్మ బదిలీల్లో నెల్లూరు జిల్లా నరసింహకొండ ఈఓగా నియమితులయ్యారు. సునీల్ కుమార్ ప్రస్తుతం కంతంరాజు కొండూరు దేవస్థానం ఈఓగా పనిచేస్తున్నారు. ఆయన్ను అమరావతి అమరేశ్వర ఆలయ ఇన్‌చార్జి ఈఓగా నియమించారు.

తప్పిపోయిన విద్యార్థులు కన్నవారికి అప్పగింత



పిడుగురాళ్ల: ఇద్దరు విద్యార్థులు పారిపోయి పిడుగురాళ్లలో ఉండగా గుర్తించిన పట్టణ పోలీసులు... వారిని కన్నవారికి అప్పగించిన సంఘటన బుధవారం జరిగింది. పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు పట్టణంలోని నగరంపాలెంకు చెందిన 6వ తరగతి విద్యార్థులు షేక్ అబ్దుల్ ఖాదర్, సయ్యద్ మహ్మద్ నిహార్‌లు స్కూల్ యూనిఫాంలో పుస్తకాల బ్యాగ్‌తో పిడుగురాళ్ల పట్టణంలో తిరుగుతూ కనిపించారు. అనుమానం వచ్చి పట్టణ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఇంట్లో నుంచి పారిపోయి వచ్చినట్లు గుర్తించారు. వెంటనే అబ్దుల్ ఖాదర్ తండ్రి ఖాదర్ మస్తాన్, సయ్యద్ మహ్మద్ నిహార్ తండ్రి ఆల్ బాషాలను పిడుగురాళ్ల పిలిపించారు. వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు ఎంత బిజీగా ఉన్నా కొంత సమయం వారితో గడపాలని సూచించారు. సీఐ వెంట ఏఎస్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

రైతులు ఆర్గానిక్ సర్టిఫికెట్ తీసుకోవాలి



నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు ఆర్గానిక్ సర్టిఫికెట్ తీసుకోవాలని డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీపీఎం అమలకుమారి, రాష్ట్ర రీసోర్స్ పర్సన్ మాధవి, జిల్లా అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఆర్గానిక్ సర్టిఫికెట్ తీసుకోవడం ద్వారా తాము పండించిన పంటలకు నేరుగా మార్కెట్లో విక్రయించవచ్చని తెలిపారు. జిల్లాలో 32,113 మంది రైతులు 39,113 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్టు తెలిపారు. ఈ పంటలకు, రసాయన వ్యవసాయ పంటలకు వ్యత్యాసం కోసం పంట కోత ప్రయోగాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలోకి రైతులను మార్చే దిశగా సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. వరి పంట సాగు చేసే కంపాక్ట్ బ్లాకుల్లో ప్రతి రైతు గట్లను ఐదు అడుగుల వెడల్పు చేసి జామ, బొప్పాయి, అరటి వంటి పండ్లజాతి, తీగ జాతి, ఆకు కూరలు, కూరగాయలు, దుంపజాతి వేయడం వలన అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. మిరపలో అంతర పంటగా ఉల్లి, బంతి, ముల్లంగి, కొత్తిమీర వేయాలని సూచించారు. దీని వలన మిరపలో చీడపీడల నివారణ జరుగుతుందని తెలిపారు.



గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జన సందోహానికి అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సహానా మృతదేహం వద్ద విషణ్ణ వదనంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆడబిడ్డలకు అండ

మహిళల రక్షణలో ప్రభుత్వం ఘోరంగా విఫలం : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అఘాయిత్యాలలో బలైన యువతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున సాయం

- టీడీపీ గూండాల చేతిలో బలైన సహానా కుటుంబానికి జననేత పరామర్శ
- గుంటూరులో అధినేతకు మద్దతుగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- నిందితుడికి టీడీపీతో సంబంధాలు ఉన్నందునే రక్షిస్తున్నారని ఆరోపణ
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టీకరణ

సాక్షి ప్రతినిధి, గుంటూరు, పట్నంబజారు: రాష్ట్రంలో హత్యాచార బాధితుల కుటుంబాలకు అండగా నిలుస్తామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. టీడీపీ గూండాల చేతిలో బలైన ఆడబిడ్డ కుటుంబానికి తానున్నానే భరోసా కల్పించేందుకు బుధవారం గుంటూరు వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ కార్యకర్తలు, ప్రజానీకం, కులసంఘాల నేతలు మద్దతుగా నిలిచారు. ఆడపడుచుకు సోదరుడిగా .. సదరు నిందితులను నిలదీసిన జననేత పక్షాన తామున్నామని గొంతెత్తి చాటారు. గుంటూరు జీజీహెచ్‌లో సహానా మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబసభ్యులను వైఎస్ జగన్ ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరిగిన ఏడు హత్యాచార ఘటనల్లో చంద్రబాబు స్పందించినా లేకపోయినా, తమ పార్టీ నుంచి రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తున్నామని ప్రకటించారు. దీంతో పెమ్మసాని చంద్రశేఖర్ అనుచరుడు నవీన్ దాడిలో చనిపోయిన తెనాలి యువతి సహానా, రెండు నెలల క్రితం చేబ్రోలులో హత్యకు గురైన శైలజ, వేటపాలెం మండలంలో హత్యకు గురైన సుచరిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ తరపున రూ. 10 లక్షల వంతున ఆర్థిక సాయం అందనుంది. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన జరుగుతోందని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ వారు ఏ తప్పు చేసినా వెనకేసుకొచ్చేలా చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. రాబోయేది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ విధంగా దాడులకు, అత్యాచారాలకు పాల్పడిన వారిని వెతికి మరీ జైళ్లకు పంపుతామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. సహానాను పని చేస్తున్న ప్రదేశానికి వచ్చి కారులో నవీన్ ఎక్కించుకెళ్లి ఇంకొందరితో కలిసి వేధించాడని, శారీరకంగా హింసించారని తెలిపారు. ఆమె శరీరమంతా కందిపోయిన గుర్తులు కనిపిస్తున్నాయని, ప్రైవేటు పార్ట్‌లూ విచ్ఛిన్నం చేసినట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఇక్కడికి తీసుకొచ్చి పడేసి, కుటుంబ సభ్యులు రాగానే జారుకున్నారని తెలిపారు. ఈ విషయాలను పోలీసులు ఎందుకు దాచి పెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. నవీన్‌తోపాటు ఉన్న మరో ఇద్దర్ని ఎందుకు అదుపులోకి తీసుకోవడం లేదని వైఎస్ జగన్ మండిపడ్డారు. తాను దళితులకు తోడుగా ఉంటానని, దళితులంతా తమ వారే అని పేర్కొన్నారు. తాను ఈ విషయాన్ని ధైర్యంగా చెబుతానని స్పష్టం చేశారు. పేదలకు తోడుగా ఉన్నామని ప్రభుత్వం చెప్పాలిగానీ, కూటమి సర్కారు మాత్రం ఆ పని చేయడం లేదన్నారు. పైగా తమ పార్టీ వారిని నిందించడం సరైనదేనా? అని నిలదీశారు. సహానా తల్లికి తాము తోడుగా నిలబడితే.. తమపై నిందలు వేయడం సబబా? అంటూ జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆయన వెంట టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు విడదల రజిని, మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, వరుదు కళ్యాణి, కల్పలతారెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వైఎస్సార్ సీపీ గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అన్నాబత్తుని శివకుమార్, కోన రఘుపతి, నంబూరు శంకరరావు, పార్టీ నగర అధ్యక్షులు, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, రేపల్లె సమన్వయకర్త ఈవూరి గణేష్, పార్టీ నేత మేకతోటి దయాసాగర్ ఉన్నారు.



సహానా మృతదేహంపై గాయాలను పరిశీలిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జననేతకు మద్దతుగా...

తొలుత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో బుధవారం ఉదయం 10.50 గంటలకు గుంటూరులోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. అప్పటికే పెద్ద ఎత్తున తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా.. ముందుకు సాగారు. గుంటూరు జిల్లా కోర్టు మీదుగా వెళుతూ న్యాయవాదులు అందజేసిన వినతిపత్రాన్ని స్వీకరించారు. మెడికల్ కళాశాల మీదుగా ఆసుపత్రికి చేరుకున్నారు. వైఎస్ జగన్‌కు మద్దతు తెలిపేందుకు పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు, పలు దళిత సంఘాల నేతలు అక్కడకు చేరుకున్నారు. గుంటూరు జీజీహెచ్‌లోని మార్చురీ వద్దకు వైఎస్ జగన్ చేరుకునే సరికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. సహానా మృతి గురించి జీజీహెచ్‌లో వైద్యులతో వైఎస్ జగన్ మాట్లాడారు.



వైద్యులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న వైఎస్ జగన్

వేధింపులు.. కక్ష సాధింపులు

వైఎస్సార్ సీపీలోని దళితులు, బలహీన వర్గాలే టార్గెట్

- బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌పై కేసుల పరంపర
- వేమూరులో అశోక్‌బాబుపై కేసులు
- యద్ధనపూడిలో ఎస్సీలపై రౌడీషీట్లు
- రేపల్లెలో దళిత నేతలపై దాడులు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు టార్గెట్‌గా తెలుగుదేశం ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోంది. దాడులకు తెగబడడంతోపాటు అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలను టార్గెట్ చేసి వేధింపులకు గురిచేస్తున్నారు.

అశోక్‌బాబుపై అక్రమ కేసులు..

టీడీపీ అధికారంలోకి వచ్చాక వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం అద్దేపల్లి ఎస్సీ కాలనీలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని పచ్చపార్టీ వారు పెట్రోల్ పోసి తగులబెట్టారు. దీనికి నిరసనగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు కాలనీ వద్దకు చేరుకొని అధికారపార్టీ నేతల తీరును ఖండించారు. కళ్లకు నల్లబ్యాడ్జీ కట్టుకొని నిరసన దీక్షకు దిగారు. ఆయనకు పెద్దఎత్తున మద్దతు లభించింది. వేలాదిమంది కార్యకర్తలు మద్దతుగా రావడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అశోక్‌బాబుతో పాటు పలువురిపై అక్రమ కేసులు నమోదు చేశారు. చివరకు వైఎస్ విగ్రహం స్థానంలో అశోక్‌బాబు మరొక విగ్రహం ఏర్పాటు చేశారు.

ఎస్సీ నేతలపై రౌడీషీట్లు..

పర్చూరు నియోజకవర్గం యద్ధనపూడి మండలానికి చెందిన పలువురు ఎస్సీ నేతలపై పచ్చ ప్రభుత్వం రౌడీషీట్లు ఓపెన్ చేసి కక్షపూరితంగా వ్యవహరించింది. మండలానికి చెందిన పర్చూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలెపోగు రాంబాబు వైఎస్సార్ సీపీలో చురుకైన నేతగా ఉన్నారు. పచ్చపార్టీ ఆధిపత్యం ఉన్న నియోజకవర్గంలో ఎస్సీ సామాజికవర్గాన్ని సమన్వయం చేసి వైఎస్సార్ సీపీకి మద్దతుగా కూడగట్టారు. నియోజకవర్గంలో దళిత వేదిక ఏర్పాటు చేసి వారికి అండగా ఉన్నారు. ప్రభుత్వం రాంబాబుతోపాటు ఆయన సామాజికవర్గం వారు ఏడుగురిపై రౌడీషీట్లు ఓపెన్ చేసి బెదిరింపులకు దిగింది. చురుగ్గా ఉన్న బలహీన వర్గాలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తే వారు వైఎస్సార్ సీపీకి దూరంగా ఉంటారన్నది పచ్చపార్టీ ఎత్తుగడగా ఉంది. కానీ వారు ఏమాత్రం బెదరడంలేదు. అక్రమ కేసులు బనాయించడమే కాకుండా మరోవైపు పచ్చనేతలు వైఎస్సార్ సీపీకి చెందిన దళిత నేతలపై ఏకంగా దాడులకు తెగబడిన సంఘటనలు కోకొల్లలు.

- రేపల్లె నియోజకవర్గం చెరకుపల్లి మండలం రాంబొట్లవారిపాలెంకు చెందిన దళిత నాయకుడు రాజ్‌కుమార్ ఇంటిపై దాడిచేసి తీవ్రంగా కొట్టి గాయపరిచారు. ఇంటిఅద్దాలు ధ్వంసం చేశారు. ఊరు విడిచిపెట్టి వెళ్లాలని బెదిరించారు.
- ఇదే మండలం గుళ్లపల్లికి చెందిన మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు డ్రైవర్ గాలి సంపత్‌కుమార్ అనే దళితుడిని ఇంటిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. అంతు తేలుస్తామంటూ బెదిరించారు. జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీకి చెందిన దళిత నేతలు, కార్యకర్తలను పచ్చనేతలు బెదిరించడంతోపాటు దాడులు చేసి కొట్టిన సంఘటనలతోపాటు అక్రమ కేసులు బనాయించిన ఘటనలు అనేకం.



బయటకు రాకుండా నందిగంపై కుట్ర

బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను చంద్రబాబు ప్రభుత్వం టార్గెట్ చేసింది. కేసులు బనాయించి హింసిస్తోంది. సురేష్‌ను జైలుకు పంపిన ప్రభుత్వం మరిన్ని కేసులు పెట్టి బయటకు రాకుండా చేసే కుట్రకు తెరలేపింది. అనారోగ్యంతో ఉన్న ఆయనకు సక్రమంగా వైద్య సేవలు అందించక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సన్నిహితంగా మెలిగిన సురేష్‌పై ప్రభుత్వం ఇలా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. వైఎస్సార్ సీపీ నేతలను సర్కార్ నిత్యం వేధిస్తోంది.

పేటలో ఓ ప్రజాప్రతినిధి కాసుల వేట!

వాడరేవు-నకరికల్లు జాతీయ రహదారి 167ఏ విస్తరణ పనులకు భూసేకరణ అడ్డంకిగా మారింది. వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు ప్యాకేజ్-1లో చేపట్టిన పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్యాకేజీ-2లో చిలకలూరిపేట నుంచి నకరికల్లు వరకు రహదారిని విస్తరించాల్సి ఉంది. నరసరావుపేట బైపాస్ రోడ్డు నిర్మాణం ఈ ప్యాకేజీలో చేపట్టాల్సి ఉంది. నరసరావుపేట చుట్టుపక్కల భూములు అధిక ధర పలకడంతో రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదు. తాజాగా ఎలైన్‌మెంట్ మార్చే ప్రతిపాదనను జాతీయ రహదారుల పనులు పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధి తీసుకొచ్చినట్టు తెలిసింది. డీపీఆర్‌ను మార్చేందుకు కేంద్ర అధికారుల కోసం ప్రజాప్రతినిధి భారీగా నగదు డిమాండ్ చేసినట్టు సమాచారం.

- వాడరేవు - నకరికల్లు వరకు 167ఏ విస్తరణ పనులు
- చిలకలూరిపేట-నరసరావుపేట మధ్య అడ్డంకులు
- విలువైన భూములిచ్చేందుకు రైతుల నిరాకరణ
- బైపాస్ అలైన్‌మెంట్ మారుస్తున్నారంటూ ప్రచారం
- దీనికోసం ఎకరానికి రూ.2 లక్షల చొప్పున వసూళ్లు
- చక్రం తిప్పుతున్న ఓ ప్రజాప్రతినిధి



నాదెండ్ల తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న జేసీ సూరజ్

నరసరావుపేట రూరల్: చీరాల వాడరేవు నుంచి నకరికల్లు వరకు చేపట్టిన 167ఏ జాతీయ రహదారి పనులు ముందుకు సాగడం లేదు. ప్యాకేజీ-1లో భాగంగా వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు 47 కిలోమీటర్ల పనులు గత ఏడాది ప్రారంభమయ్యాయి. రూ.825 కోట్లతో వీటిని నిర్వహిస్తున్నారు. రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాలి. వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు పనులు ప్రారంభించిన కంపెనీ గడువులోగా పూర్తి చేయడానికి వేగంగా పని చేస్తోంది.

భూ సేకరణతో సమస్యలు..

మొదటి ప్యాకేజీ పనులు కొలిక్కి వచ్చినా ఇప్పటి వరకు రెండవ ప్యాకేజీ పనులు ప్రారంభించలేదు. ప్యాకేజీ-2లో చిలకలూరిపేట, నాదెండ్ల, నరసరావుపేట, రొంపిచర్ల, నకరికల్లు మండలాల్లోని రైతుల నుంచి భూసేకరణ చేయాల్సి ఉంది. నాదెండ్ల, రొంపిచర్ల, నకరికల్లు మండలాల్లోని రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చినా, నరసరావుపేట మండలంలోని రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత నరసరావుపేట పట్టణం చుట్టుపక్కల భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో విలువైన భూములు కోల్పోయేందుకు రైతులు సిద్ధంగా లేరు. దీంతో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రెవెన్యూ, ఎన్‌హెచ్‌ఏ సిబ్బంది పంట పొలాల్లో ఏర్పాటు చేసిన రాళ్లను రైతులు తొలగించారు.



ఇర్లపాడు వద్ద రోడ్డు విస్తరణకు మార్కింగ్

బైపాస్ ఎలైన్‌మెంట్ మార్చే ప్రయత్నం...!

167ఏ జాతీయ విస్తరణలో భాగంగా నరసరావుపేట పట్టణం నుంచి కాకుండా బైపాస్ రోడ్డును ప్రతిపాదించారు. మండలంలోని కేసానుపల్లి, జొన్నలగడ్డ, ఇస్సప్పాలెం, రావిపాడు గ్రామాల మీదుగా బైపాస్‌ను నిర్మించేలా డీపీఆర్‌ను సిద్ధం చేశారు. ఆయా గ్రామాల రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, అధికారపార్టీకి పట్టు ఉన్న గ్రామాలు కావడంతో బైపాస్ రోడ్డు ఎలైన్‌మెంట్ మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం ఊపందుకుంది.

రంగంలోకి ప్రజాప్రతినిధి..

బైపాస్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు జాతీయ రహదారుల పనులను పర్యవేక్షిస్తూ, ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పుతున్న ప్రజాప్రతినిధిని ఆశ్రయించారు. అధికార పార్టీకి చెందిన రైతులే భూములు కోల్పోతున్న వారిలో అధికంగా ఉండటంతో ప్రజాప్రతినిధి బైపాస్ ఎలైన్‌మెంట్ మార్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. డీపీఆర్‌ను మార్చేలా కేంద్ర ప్రభుత్వ అధికారులను ఒప్పించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు సమాచారం. ఇందుకు దాదాపు రూ.5 కోట్లు ఖర్చు అవుతుందని ప్రజాప్రతినిధి రైతులకు తెలిపారట. ఈ మేరకు రెండు రోజుల క్రితం జొన్నలగడ్డలో రైతులు సమావేశమయ్యారు. ఎకరానికి రూ.2 లక్షల చొప్పున వసూళ్లు చేసి ప్రజాప్రతినిధికి అందించాలని ప్రతిపాదించారు. దీనిపై రెవెన్యూ అధికారులను సంప్రదించగా అలైన్‌మెంట్ మార్పుపై అధికారకంగా సమాచారం లేదని తెలిపారు.

క్లుప్తంగా

రేపటి నుంచి పశుగణన ప్రారంభం

వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ లావు

నరసరావుపేట: పశుగణన జిల్లాలో ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నారు. ఈ మేరకు 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, హౌస్‌హోల్డ్ స్టిక్కర్లు, వాస్‌పోస్టర్లు, మాన్యువల్స్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో జిల్లాలోని 365 రెవెన్యూ గ్రామాల్లోని 239 వార్డుల్లోని 5,55,158 గృహాల్లో 234 మంది ఎన్యుమరేటర్లు పశుగణన చేస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, టీడీపీ నాయకులు కపలవాయి విజయకుమార్, నల్లపాటి రాము, పాల్గొన్నారు.

28న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 28న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని తెలిపారు. నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమానికి హాజరుకాగోరు వాటాదారులు, ఇతర శాఖల అధికారులు సూచనలు చేయవచ్చని తెలిపారు.

సమావేశాలు జరిగే ప్రాంతాలు..

- **గుంటూరు జిల్లా:** పేరేచర్లలోని జోసిల్ కంపెనీ
- **పల్నాడు జిల్లా:** చిలకలూరిపేటలోని సెయింట్ జేవీయర్స్ గ్లోబల్ స్కూల్
- **బాపట్ల జిల్లావాసులకు:** పొన్నూరు మండలం పచ్చలతాడిపర్రు గ్రామంలోని డాన్ బాస్కో ఇంగ్లిష్ మీడియం స్కూల్
- **కృష్ణాజిల్లా:** బాపులపాడు మండలం రేమల్లె గ్రామంలోని మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్
- **ఎన్టీఆర్ జిల్లా:** విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలోని ఆయుష్ ఎన్నారై ఎల్ఈపీఎల్ హెల్త్‌కేర్
- **ప్రకాశం జిల్లా:** పొదిలిలోని వివేకానంద జూనియర్ కళాశాల

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థినుల ఎంపిక

నరసరావుపేట రూరల్: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నలుగురు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి బుధవారం తెలిపారు. గుంటూరులో ఈనెల 20వ తేదీన నిర్వహించిన అండర్-18 జూనియర్ ఖోఖో చాంపియన్ షిప్ ఎంపిక పోటీలలో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. పాఠశాలకు చెందిన బి.సౌజన్య, టి.లక్ష్మీప్రసూన చంద్రిక, డి.రంగమహాలక్ష్మి, టి.మణిదీప్ ఎంపికైన వారిలో ఉన్నారని తెలిపారు. ఈనెల 25, 26, 27 తేదీలలో చిత్తూరు జిల్లా కాణిపాకంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఖోఖో చాంపియన్‌షిప్‌లో వీరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్‌కే మహబూబ్‌బాషా, వ్యాయమ ఉపాధ్యాయులు ఎస్‌కే కరీముల్లా, రాధాకృష్ణ, రామకృష్ణారెడ్డి అభినందించారు.



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం పార్వతి, వ్యాయమ ఉపాధ్యాయులు

ఉత్కంఠగా జట్టు ఎంపిక మ్యాచ్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 రాష్ట్ర జట్టు ఎంపిక మ్యాచ్‌లలో భాగంగా గ్రూప్-ఏ, గ్రూప్-బీ మ్యాచ్ రసవత్తరంగా మారింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన గ్రూప్-ఏ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 103 పరుగులకే ఆలౌట్ అయింది. నిన్నటి ఓవర్‌నైట్ స్కోర్ 5 వికెట్లు నష్టానికి 150 పరుగులు చేసి భారీ స్కోర్ దిశగా వెళుతున్న గ్రూప్-బీ జట్టు బుధవారం బ్యాటింగ్‌కు దిగి మరో 29 పరుగులు మాత్రమే జోడించి 179 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని గౌతమ్‌కృష్ణ 46 పరుగులు సాధించగా, గ్రూప్-ఏ బౌలర్ ఎ.నాగకుల్లయప్ప 18 ఓవర్లలో 27 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు సాధించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గ్రూప్-ఏ జట్టు 246 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని రాజేష్ 47 పరుగులు సాధించాడు. గ్రూప్-బీ బౌలర్ అక్షిత్‌రెడ్డి 20 ఓవర్లు వేసి 79 పరుగులు ఇచ్చి 6 వికెట్లు సాధించాడు. అనంతరం 171 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గ్రూప్-బీ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టపోయి 14 పరుగులు సాధించింది. గురువారం మూడో రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.



అక్షిత్‌రెడ్డి, 6 వికెట్లు, గ్రూప్-బి

గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు చేయాలి

ఏపీ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి

నరసరావుపేట: గ్రామపంచాయతీలకు రావాల్సిన వివిధ గ్రాంట్ల కింద మంజూరైన నిధులను విడుదల చేయాలని ఏపీ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజా ప్రతినిధులు ఉన్న 518 గ్రామపంచాయతీలలో నిధులు లేక పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రిజిస్ట్రేషన్ సర్‌చార్జి, తలసరి గ్రాంట్‌లు గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. రిజిస్ట్రేషన్ సర్‌చార్జి నిధులు ఆరునెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, గ్రామ పంచాయతీలకు బదిలీ అయ్యే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో నీటి సరఫరా, బ్లీచింగ్‌కు పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు, విద్యుత్ బకాయిలు ఇచ్చేందుకు వెసులుబాటుగా ఉంటుందని విన్నవించారు. కలెక్టర్ స్పందిస్తూ రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న డాక్టర్ జాస్తి వీరాంజనేయులు

రేపు రెజ్లింగ్ జట్టు ఎంపికలు

అచ్చంపేట: పల్నాడు జిల్లా స్థాయి రెజ్లింగ్(కుస్తీ) ఎంపిక పోటీలు ఈనెల 25న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి గుడిపూడి భూషణం బుధవారం తెలిపారు. పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్(కుస్తీ)అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 2005కు ముందు జన్మించినవారై ఉండాలని, ధ్రువీకరణ పత్రం, ఆధర్ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకురావాలన్నారు. ఎంపికైన విద్యార్థులు నవంబర్ 9,10 తేదీలలో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో పాల్గొంటారని చెప్పారు. పూర్తి వివరాలకు 9111936823 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

సహానా మృతి కారకులను కఠినంగా శిక్షించాలి

లక్ష్మీపురం: టీడీపీ కార్యకర్త, రౌడీషీటర్ నవీన్ చేతిలో అత్యంత పాశవికంగా లైంగిక వేధింపులకు గురై, గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సహానా కుటుంబానికి సీపీఐ పూర్తి సహకారం అందిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సహానా కుటుంబాన్ని సీపీఐ నాయకులు బుధవారం పరామర్శించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బాధిత సహనా మృతికి కారుకులైన నవీన్, అతని మిత్రులు, ఇతర నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతూ ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం చొరవ తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత సహనా కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు అరుణ్ తదితరులు ఉన్నారు.



మృతురాలు సహానా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్ట్

మార్టూరు: వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ మహిళను హత్య చేసి పారిపోయిన నిందితుడిని మార్టూరు పోలీసులు 48 గంటల్లో అరెస్టు చేశారు. సీఐ మద్దినేని శేషగిరిరావు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో వివరాలు వెల్లడించారు. మార్టూరు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన సూరేపల్లి నాగరాజు కుమార్తె నాగండ్ల మేరీ (27) భర్తతో విభేదాల కారణంగా గత రెండు సంవత్సరాల నుంచి తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. మేరీకి ఇద్దరు సంతానం. ఈ క్రమంలో పొగాకు కూలీ పనుల నిమిత్తం మేరీ ఆమె తల్లిదండ్రులతో కలిసి గత సంవత్సరం నెల్లూరు జిల్లా డీసీ పల్లి వెళ్ళింది. అక్కడ కొరిశపాడు మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన కండే ప్రసాదు అనే వ్యక్తితో పరిచయమై వివాహేతర సంబంధానికి దారితీసింది. ఇద్దరూ కలిసి వేరే ప్రాంతానికి వెళ్లి కొంతకాలం సహజీవనం చేశారు. కాగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మేరీ తండ్రి నాగరాజు ఇటీవల తన కుటుంబంతో మార్టూరు మండలం డేగరమూడి గ్రామానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో తండ్రి అనారోగ్యం కారణంగా ప్రసాదును వదిలి తండ్రి వద్దకు వచ్చిన మేరీని.. తిరిగి తన వద్దకు రావాలని ప్రసాదు హెచ్చరించసాగాడు. ఈ క్రమంలో గత ఆదివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో మేరీ వద్దకు వచ్చిన కండే ప్రసాదు.. తనతో తెచ్చుకున్న కత్తితో ఆమె మెడ, కడుపు, వీపు, చేతులపై విచక్షణారహితంగా నరికి పారిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న మేరీని అదే రోజు రాత్రి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మేరీ తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న సీఐ శేషగిరిరావు నిందితుడు ప్రసాద్ ఆచూకీ కోసం సిబ్బందిని పలు బృందాలుగా పంపించారు. బుధవారం ఉదయం మేదరమెట్ల సమీపంలోని బస్సు షెల్టర్ వద్ద నిందితుడు ప్రసాద్‌ని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకొని అద్దంకి కోర్టుకి హాజరుపరచగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఒంగోలులోని జిల్లా జైలుకు తరలించారు. నిందితుడిని రెండు రోజుల్లోనే అరెస్టు చేసిన సీఐ శేషగిరిరావు బృందం గరుత్మంతుడు, పులి ఆంజనేయులు, కోటేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు తదితరులను ఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు.



ఓపెన్‌హౌస్‌తో పోలీస్ విధులపై అవగాహన

- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు
- జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్‌హౌస్ ఏర్పాటు
- వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు
- పోలీసు జాగిలం ప్రదర్శన ఏర్పాటుచేసిన పోలీసులు

నరసరావుపేట: అసాంఘిక శక్తుల అణచివేత, శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, దర్యాప్తులో పోలీసులు తీసుకునే చర్యల గురించి తెలియజేయడమే ఓపెన్‌హౌజ్ ముఖ్యఉద్దేశమని ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళలను గౌరవించడం మన ధర్మం, భారతీయ సంస్కృతి, కొన్ని సోషల్ మీడియా వెబ్‌సైట్‌లలో మహిళలకు సంబంధించి ఇబ్బందికర వీడియోలు అప్‌లోడ్ చేస్తుంటారని, వాటిని చూడవద్దని సూచించారు. పాఠశాలలో చదువుకొనే పాఠ్యాంశాలు రేపటి రోజున భావి పౌరులుగా తీర్చిదిద్దే విధంగా ఏర్పాటు చేయబడ్డాయని, చెడు అలవాట్లకు అలవాటు పడిన వారు గంజాయి తాగుదాం, డ్రగ్స్ తీసుకుందామని, ఆడపిల్లలను ఏడిపించాలని అన్నా కూడా ఎవరూ స్పందించవద్దని కోరారు. వయోవృద్ధులు ఎవరైనా కనబడితే చేయుతనివ్వాలని అన్నారు. పోలీసు జాగిలాలు విధి నిర్వహణలో భాగంగా పేలుడు పదార్థాలను వాసన చూస్తే వాటి ఊపిరితిత్తులు పాడవుతున్నా మన నుంచి ఏమి ఆశించకుండా ఆ జాగిలాలు మన రక్షణలో భాగమైనప్పుడు మనుషులమైన మనం కచ్చితంగా మంచి ప్రవర్తనను కలిగి ఉండాలని వెల్లడించారు. భావిపౌరులైన విద్యార్థులు ఎదుటి వ్యక్తి స్వేచ్ఛను హరించే విధంగా ప్రవర్తించకూడదని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వేగ నియంత్రణ పాటిస్తూ ఇతరుల ప్రాణాలకు హాని కలుగకుండా వాహనాలను నడపాలని అన్నారు. ఆయుధాల వినియోగంపై ఏఆర్ డీఎస్పీ జి.మహాత్మా గాంధీ, వెల్ఫేర్ ఆర్ఐ ఎల్.గోపినాథ్, యువరాజ్, ఎంటీ ఆర్ఐ కృష్ణ, అడ్మిన్ ఆర్ఐ ఎం.రాజా అవగాహన కల్పించారు. నేర దర్యాప్తులో ప్రముఖ పాత్ర పోషించే జాగిలాల ప్రదర్శనను చూపించారు. జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్ (పరిపాలన), పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఓపెన్‌హౌస్‌కు హాజరైన విద్యార్థులకు పోలీసు జాగిలం ప్రదర్శన చూపిస్తున్న పోలీసులు



ఓపెన్ హౌస్ ప్రదర్శనలో హెల్మెట్ ప్రాధాన్యాన్ని వివరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

మూడు ట్రాక్టర్లు, పొక్లెయిన్ స్వాధీనం

గురజాల రూరల్: మూడు ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం....మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో స్తంభాల బోడులో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారనే ఆరోపణలతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆ ప్రాంతంలో ఉన్న మూడు ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కూటమిలో వర్గపోరు..

మాడుగులలో కూటమిలో వర్గపోరు బహిర్గతమైంది. గ్రామంలో పలువురు యువకులు పలు మాలలు ధరించారు. గ్రామంలోని శివాలయం వద్ద స్వాములు స్నానమాచరించడంతో పాటు సద్ది సమయంలో చిన్నపాటి వర్షం కురిసినా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీంతో కూటమిలో ఒక వర్గానికి చెందిన స్వాములు గ్రామానికి చెందిన ముక్కంటికి ఉన్న ట్రాక్టర్లుతో పొక్లెయిన్ సహాయంతో గ్రావెల్ తోలమని కోరారు. మరొక వర్గానికి చెందిన కూటమి నాయకులు గ్రావెల్ తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ట్రాక్టర్లు, పొక్లెయిన్ స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ముక్కంటిపై దాడి చేశారు. కావాలనే నన్ను ఇబ్బందులు పెడుతున్నారని వారిలో ఉన్న వర్గపోరుతోనే ఈ విధంగా అక్రమ కేసులో ఇరికించారని ముక్కంటి వాపోయాడు.


బైపాస్ రోడ్డెక్కిన మొసలి



పిడుగురాళ్ల: పట్టణంలోని బైపాస్‌పై బుధవారం తెల్లవారుజామున మొసలి రోడెక్కింది. లారీలకు, వాహనదారులకు రోడ్డుకు అడ్డంగా మొసలి కనిపించటంతో వాహనదారులు బెంబేలు ఎత్తారు. దీంతో కొంత సమయం పాటు వాహనాలు కొంత సమయం నిలిపివేశారు. రోడ్డు బైపాస్ రోడ్డు దాటి మడుగులోకి వెళ్లటంతో వాహనాలు యథావిధిగా వెళ్లారు. స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఫారెస్ట్ డెప్యూటీ రెంజ్ ఆఫీసర్ వీరేశలింగంతోపాటు సిబ్బంది హాజరై మొసలి తిరిగిన ప్రాంతాలను పరిశీలించారు. మొసలి ఆచూకీ దొరకపోవటంతో ఫారెస్ట్ అధికారులు మొసలిని పట్టుకునేందుకు బైపాస్ రోడ్డులోని రిక్షా కాలనీ సమీపంలో మడుగు ఉన్న ప్రాంతంలో ట్రాప్ గేజ్‌ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

లింగాపురంలో కౌలురైతు ఆత్మహత్య

అమరావతి: మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన కౌలు రైతు పెద్ది బోయిన గంగయ్య(26) ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గంగయ్య మూడేళ్లగా ఎనిమిది ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. వ్యవసాయం కలిసి రాకపోవడంతో నష్టాలపాలయ్యాడు. మిరప, పత్తి పంటలను సాగుచేశాడు. వ్యవసాయంలో నష్టం వచ్చి అప్పులపాలవటంతో పాటు, అప్పులకు వడ్డీలు కట్టలేక ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుమందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు అమరావతి సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై అమరావతి పోలీసులు కేసు నమోదు చేశారు. శవ పంచనామా చేసి మృతి చెందిన గంగయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు గంగయ్యకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.



గంగయ్య మృతదేహం

నూతన ఆవిష్కరణలపై ఆసక్తి పెంపొందించాలి

- డీఈఓ వెంకటేశ్వర్లు
- ముగిసిన అటల్ టింకరింగ్ వర్క్‌షాప్

నాదెండ్ల: నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించి నూతన ఆవిష్కరణలు చేపట్టేలా వారిని ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని చిరుమామిళ్ళ మోడల్ స్కూల్‌లో ఈనెల 21 నుంచి బుధవారం వరకు మూడురోజుల పాటు నిర్వహించిన రీజనల్ అటల్ టింకరింగ్ వర్క్‌షాప్ ముగిసింది. వర్క్‌షాప్‌ను సమగ్ర శిక్ష, యూనిసెఫ్, విజ్ఞాన మందిరం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రీజియన్ పరిధిలోని ఏడు జిల్లాల నుంచి 36 మంది ఉపాధ్యాయులు వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. సమావేశంలో డీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వర్క్‌షాప్‌లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి వారిలో ఆవిష్కరణలపై ఆసక్తి పెంపొందేలా కృషి చేయాలన్నారు. పాఠశాలల్లోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి ఎస్.రాజశేఖర్ మాట్లాడుతూ, తరగతి విద్యలో వెనుకబడిన విద్యార్థులలో అవగాహన పెంచి వారిని నూతన ఆవిష్కరణ కార్యక్రమాలలో భాగస్వాములను చేయాలని తెలిపారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వాణి, సీనియర్ సైన్స్ ఉపాధ్యాయుడు ఏఏ మధుకుమార్, రోజారమణి, పాలేటి శ్రీనివాసరావు, కుంభ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డీఈఓ వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న సైన్స్ ఉపాధ్యాయులు

ఇల్లు అద్దెకు కావాలంటూ..

- వృద్ధ దంపతుల ఇంటిలో చోరీకి యత్నం
- కేకలు వేయడంతో దాడి చేసి పరార్

సత్తెనపల్లి: ఇల్లు అద్దెకు కావాలని వెళ్లి వృద్ధ దంపతుల ఇంటిలో చోరీకి యత్నించిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. పట్టణంలోని రైల్వే స్టేషన్‌రోడ్ లో వృద్ధుడు తనుగుంట్ల సీతారామయ్య దంపతులు నివాసం ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం ఇరువురు యువకులు వెళ్లి ఇల్లు అద్దెకు కావాలని అడిగారు. బ్యాచ్‌లర్సా, ఫ్యామిలీనా అని సీతారామయ్య ప్రశ్నించగా ఫైనాన్స్ ఆఫీస్ పెట్టుకుంటామని యువకులు సమాధానం చెప్పారు. ఫ్యామిలీకి తప్ప ఇతరులకు అద్దెకు ఇవ్వనని సీతారామయ్య చెప్పడంతో యువకులు వెను తిరిగి వెళ్లారు. మరి కొంతసేపటికి మరో యువకుడితో ముగ్గురు కలసి రాగా బ్యాచులర్స్‌కు ఇవ్వనని ఇందాక చెప్పాను కదా అని సీతారామయ్య అన్నాడు. బ్యాచిలర్స్ కాదని తమ సోదరుడు ఫ్యామిలీతో ఉంటాడని చెప్పడంతో సరే ఇల్లు చూసుకోమని వారిని సీతారామయ్య పైకి తీసుకెళ్లాడు. పైన ఇల్లు చూస్తున్న ముగ్గురు యువకులు వృద్ధుడి చేతికి, మెడలో ఉన్న బంగారు ఆభరణాలను దూరంగా పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో ఆ యువకులు ఇంటి అద్దె ఎంత అని అడగ్గా రూ.8 వేలు అని చెప్పాడు. ఈ రోడ్‌లో రూ.4 వేలే కదా ఎందుకు ఎక్కువ చెబుతున్నారని వారు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో సీతారామయ్యపై ఒక్కసారిగా దాడి చేసి బంగారం నగలు అపహరించేందుకు యత్నించారు. సీతారామయ్య పెద్దగా కేకలు వేయడంతో తేరుకున్న ముగ్గురు యువకులు పరారయ్యారు. వారి వెంట తెచ్చుకున్న ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేసి వెళ్లారు. పట్టణ పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ముగ్గురి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. యువకులు వదిలేసిన ఫ్యాషన్ ప్రో ద్విచక్ర వాహనాన్ని పట్టణ పోలీసులు స్వాధీన పరుచుకొని పరిశీలించారు. ఆ వాహనం సత్తి రామారెడ్డి పేరుతో ఉంది. దీనికితోడు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా అనుమానితులైన ఎర్రసాని నాని, సత్తి గవనకుమార్ రెడ్డి, మర్రి అమ్మయ్యల పాత్రపై పట్టణ పోలీసులు లోతైన విచారణ చేస్తున్నారు. ఇప్పటికే సత్తి గవనకుమార్‌రెడ్డి, మర్రి అమ్మయ్యలను పోలీసులు అదుపులోకి తీసుకోగా ఎర్రసాని నాని పరారీలో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన సత్తెనపల్లి పట్టణంలో కలకలం రేపింది.




సత్తెనపల్లిలో వృద్ధుడిపై దాడి చేసి పరుగులు తీస్తున్న యువకులు

న్యాయ వ్యవస్థకు వన్నె తెచ్చిన లక్ష్మణరావు

ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్

గుంటూరు ఎడ్యుకేషన్: వివాదాలకు దూరంగా వృత్తి ధర్మాన్ని పాటించిన అంబటి లక్ష్మణరావు న్యాయవ్యవస్థకు వన్నె తెచ్చిన ఆదర్శనీయుడని ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కేజీ శంకర్ పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో బుధవారం అలహాబాద్ హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి దివంగత అంబటి లక్ష్మణరావు సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కేజీ శంకర్ మాట్లాడుతూ న్యాయవాదిగా, న్యాయమూర్తిగా 37 ఏళ్లపాటు నిజాయితీగా పని చేసిన అంబటి లక్ష్మణరావు పదవీ విరమణ అనంతరం 28 ఏళ్లపాటు సామాజిక సేవ చేసిన మహనీయుడని కొనియాడారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గత 75 ఏళ్లలో భారత న్యాయవ్యవస్థ స్వర్ణయుగంలో ప్రమాణాలు నెలకొల్పిన న్యాయమూర్తుల్లో జస్టిస్ లక్ష్మణరావు ఒకరని ప్రశంసించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో జస్టిస్ అంబటి లక్ష్మణరావుతో కలిసి పనిచేసే అవకాశం తనకు దక్కిందని తెలిపారు. రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు పి.రామచంద్రరాజు మాట్లాడుతూ జస్టిస్ లక్ష్మణరావు విలువలతో కూడిన నిరాడంబర, సంపూర్ణమైన జీవితాన్ని గడిపారని, ఆయన అందించిన స్ఫూర్తి ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. లక్ష్మణరావు తనయుడు డాక్టర్ రామ్ పాపారావు మాట్లాడుతూ నిరంతరం సమాజ శ్రేయస్సు కోసం, తాను నమ్మిన ఆశయాల అమలు కోసం కృషి చేసిన తమ తండ్రి సంస్మరణ సభను ఈనెల 27న హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలుత అంబటి లక్ష్మణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, మేకల రవీంద్రబాబు, ఉగ్గిరాల సీతారామయ్య, విశ్రాంత ఎస్పీ చక్రపాణి, దాసరి రాము, ఆళ్ల హరి, ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, పి.ఉమామహేశ్వరరావు, సోనా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



అంబటి లక్ష్మణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జస్టిస్ కేజీ శంకర్, కేఎస్ లక్ష్మణరావు

రౌడీషీటర్ నవీన్‌ను కఠినంగా శిక్షించాలి

తాడికొండ: తెనాలిలో సహానా మృతికి కారకుడైన రౌడీషీటర్ రాగి నవీన్‌ను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాయకులు యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు, చింతల భాస్కరరావు, కనగాల పూర్ణచంద్రరావులు డిమాండ్ చేశారు. సహానా మృతిని నిరసిస్తూ తాడికొండ పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మానవహారంగా ఏర్పడి నిందితుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని సమాజంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను కఠినంగా అమలు చేయని కారణంగానే రాష్ట్రంలో సంఘ విద్రోహ శక్తులు, యువకులు రెచ్చిపోతున్నారని యువతి కుటుంబానికి న్యాయం జరిగేలా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.